ఎల్‌ఆర్‌ఎస్ సర్వే షురూ

- విచారణ చేపట్టిన రెండు బృందాలు
- తుక్కుగూడలో 1,853 దరఖాస్తులు పెండింగ్


రావిర్యాలలో ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ (ఫైల్)

తుక్కుగూడ: ప్లాట్ల యజమానులు నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్న ఎల్‌ఆర్‌ఎస్(అనధికారిక లే అవుట్ల క్రమబద్ధీకరణ) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇప్పటివరకు తుక్కుగూడ మున్సిపాలిటీ వ్యాప్తంగా 1,853 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని సర్వే ద్వారా విచారణ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పది రోజుల నుంచి మున్సిపాలిటీ వ్యాప్తంగా కొనసాగుతోంది.

రెండు బృందాల ఏర్పాటు

మున్సిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియను క్షేత్రస్థాయిలో చేపట్టేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఆర్‌ఐలు, మున్సిపాలిటీ టీపీఓ, నీటి పారుదల శాఖ ఏఈఈలు ఉన్నారు. ఒక బృందంలో మున్సిపాలిటీ టీపీఓ వెంకటరఘునాథ్, ఆర్‌ఐ స్వర్ణలత, మహేశ్వరం మండల ఇరిగేషన్ ఏఈఈ గోవింద్ ఉండగా, మరో బృందంలో ఆర్‌ఐ పావని, మున్సిపల్ ఇంజనీరింగ్ ఏఈఈ కె.భార్గవ్‌రెడ్డి, కందుకూరు ఇరిగేషన్ ఏఈ ఖాజా ఉన్నారు.

ప్లాట్ల వివరాల నమోదు

మున్సిపాలిటీ వ్యాప్తంగా 2020లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు ప్రక్రియ సందర్భంగా 2,541 అర్జీలు వచ్చాయి. అప్పట్లో 688 దరఖాస్తులను పరిశీలించగా, 1,853 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ దరఖాస్తు ఆధారంగా బృందాలు మున్సిపాలిటీ వ్యాప్తంగా సర్వే చేపట్టాయి. దరఖాస్తు వివరాల నమోదుకు మొబైల్ యాప్‌ను రూపొందించారు. వివరాలను జియోట్యాగింగ్, ఫొటోతో పాటు యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మున్సిపాలిటీ వ్యాప్తంగా సర్దార్‌నగర్ రెవెన్యూ పరిధిలో 04, రావిర్యాలలో 05, హెచ్‌పీఆర్ వెంచర్‌లో 04 దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం మూడు దశల్లో పరిశీలన చేసి ప్రొసీడింగ్ ఇస్తారు.

అదనపు కలెక్టర్ పరిశీలన

మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ సర్వే ప్రక్రియను ఈనెల 22న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పరిశీలించారు. బృందం సభ్యుల నుంచి ఎల్‌ఆర్‌ఎస్ సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. పీఓటీ జాబితాలో ఉన్న దరఖాస్తుల కాకుండా, ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించాలని ఆమె బృంద సభ్యులకు సూచించారు.

సర్వే ముమ్మరం



మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలనకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ సిబ్బందితో రెండు బృందాలు ఏర్పాటు చేశాం. ఇవి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలన చేస్తున్నాయి. ఎలాంటి సమస్యలు లేని వాటిని మొదట పరిష్కరిస్తున్నారు.

– బి.వెంకట్రామ్, కమిషనర్, తుక్కుగూడ

పాపన్నగౌడ్ ఆశయ సాధనకు కృషి

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి
- ఘట్టుపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ

మహేశ్వరం: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని ఘట్టుపల్లి గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్వాయి పాపన్నగౌడ్ బహుజనుల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేశారన్నారు. అన్ని కులాలను ఏకం చేసి ఆసియా ఖండంలోనే 33 కోటలను జయించిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని పీడిస్తున్న మొఘల్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడాడన్నారు. పాపన్నగౌడ్ తన సంపదను ప్రజలకు ధారాదత్తం చేసిన మహారాజ్ అని కొనియాడారు. అనంతరం మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ.. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అంటే ఒక ఉద్యమం, ఉగ్రరూపం అని.. అలాంటి మహనీయుడి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాపన్న ఆనాడు గోల్కొండ ఖిల్లాను పరిపాలించిన గొప్ప నాయకుడన్నారు. బడుగు బలహీనవర్గాల పక్షాన నిలబడి నిరంతరం వారి కోసం పోరాటాలు చేశారన్నారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు సుధీర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, సభ్యులు అంజయ్యగౌడ్, భిక్షపతిగౌడ్, వెంకటేశ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, రమేశ్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, వంశీగౌడ్, నర్సింహగౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ అనితారెడ్డి, నాయకులు చంద్రయ్య, సత్తమ్మ, ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు


ఘట్టుపల్లిలో పాపన్నగౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సబితారెడ్డి, స్వామిగౌడ్ తదితరులు

క్లుప్తంగా

తిమ్మాపూర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీలలిత శివ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 26 నుంచి 28 వరకు విగ్రహాల ప్రతిష్ఠాపన, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వేద పండితుల ఆధ్వర్యంలో సోమవారం యజ్ఞం ప్రారంభించనున్నారు. 27న విగ్రహాలకు ప్రత్యేక పూజలు కొనసాగనున్నాయి. 28న శ్రీ గణపతి, సుబ్రహ్మణ్య, శివ, నంది, శ్రీలలితా త్రిపురసుందరి, శ్రీఆంజనేయ, నాగ, శిఖర, నవగ్రహ, ధ్వజస్తంభ, దేవతామూర్తుల యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నప్రసాదం అందించనున్నామని, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని నిర్వాహకులు కోరారు.

గ్రామ దేవతల సేవలో ఎమ్మెల్యే

లేమూరులో ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి తదితరులు

కందుకూరు: గ్రామ దేవతలైన పోచమ్మ, మైసమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మండల పరిధిలోని లేమూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూజారుల మంత్రోచ్ఛరణల నడుమ విగ్రహాల ప్రతిష్ఠ చేశారు. కాగా ప్రతిష్ఠాపన కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు మాజీ సర్పంచ్ ఢిల్లీ గణేశ్, మాజీ ఉప సర్పంచ్ కొండల్‌రెడ్డి, నాయకులు మేఘనాథ్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, జైపాల్, సంజీవ్‌రెడ్డి, మహేందర్, నారాయణ, అర్జున్, శ్రీధర్, నవీన్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జయంత్యుత్సవాలను విజయవంతం చేయండి


కందుకూరులో మాట్లాడుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

కందుకూరు: ముదిరాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ కొర్వి కృష్ణస్వామి 131వ జయంతిని విజయవంతం చేయాలని ముదిరాజ్ మహాసభ మండల యూత్ అధ్యక్షుడు సురేందర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు మల్లేశ్‌ముదిరాజ్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకులతో కలిసి మాట్లాడారు. సికింద్రాబాద్ న్యూబోయగూడ ముదిరాజ్ భవనంలో సోమవారం ఉదయం ఉత్సవాలను నిర్వహించనున్నామన్నారు. ఆ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ హాజరు కానున్నారన్నారు. ముదిరాజ్ కులస్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు యాదగిరిముదిరాజ్, రాజుముదిరాజ్ పాల్గొన్నారు.

తలసేమియా బాధితులకు అండగా నిలవాలి


రక్తదాన శిబిరంలో పాల్గొన్న చల్లా నర్సింహారెడ్డి

పహాడీషరీఫ్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ప్రతి ఒక్కరూ మానవత దృక్పథంతో రక్తదానం చేయాలని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని షాహీన్‌నగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలకోసారి రక్తమార్పిడి చేసుకోవాల్సిన చిన్నారుల కోసం తలసేమియా సొసైటీ రక్తం సేకరించడం అభినందనీయమన్నారు. అనంతరం మహేశ్వరం ఏసీపీ పి.లక్ష్మీకాంత రెడ్డి కూడా శిబిరాన్ని సందర్శించి నిర్వాహకులకు అభినందలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ మాజీ చైర్మన్ ఇనాయత్ అలీ బాక్రీ, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎం.ఎ.బారీ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన


కుంకుమార్చన అనంతరం మహిళాభక్తులు

మీర్‌పేట: స్థానిక శివసాయినగర్ కాలనీలోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత లక్ష్మీగణపతి దేవాలయంలో ఆదివారం ఆలయ కమిటీ, శ్రీ గాయత్రి సేవా సంఘం మీర్‌పేట వారి ఆధ్వర్యంలో సామూహిక సహస్రనామ కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తీగల సుభాష్‌రెడ్డి తెలిపారు. పూజల్లో కమిటీ సభ్యులు సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, వెంకటరమణ, గాయత్రి సేవా సంఘం సభ్యులు శ్రీనివాస ప్రసాద్, శివరామ ప్రసాద్, లక్ష్మణరావు, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత

హైడ్రా అందించిన నివేదికలో మన్సూరాబాద్ ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన బోర్డు

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధి సహారాఎస్టేట్స్ కాలనీ మొదటి గేటు సమీపంలో నిబంధనల మేరకు సెట్‌బ్యాక్‌తో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. నిర్మాణం పూర్తయిన కొన్నేళ్ల తర్వాత సెట్‌బ్యాక్ స్థలాన్ని సదరు యజమాని చదును చేయటానికి ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది.ఈ సమస్యపై జూన్ 29న 'రూ.3 కోట్ల ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్‌ఎంసీ సర్కిల్ టౌన్‌ప్లానింగ్, హైడ్రా అధికారులు స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి జూలై 1న ఆక్రమణలను కూల్చివేసి ప్రభుత్వ స్థలమని బోర్డు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదివారం కూల్చివేతలపై హైడ్రా అందించిన నివేదికలో మన్సూరాబాద్ సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన రోడ్డును ఆక్రమించి వేసిన ఫెన్సింగ్‌ను కూల్చివేసి జీహెచ్‌ఎంసీ స్థలమని బోర్డు ఏర్పాటు చేసినట్లు నివేదికలో పేర్కొన్నారు.

ప్రతిపక్ష నేతల మాటలు నమ్మొద్దు

ఆమనగల్లు: ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిందని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడారు. మాఫీపై ప్రజల్లో అపోహలు సృష్టిస్తున్న ప్రతిపక్ష పార్టీ నేతల మాటలు నమ్మవద్దని సూచించారు. గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్.. రైతులకు రుణమాఫీ హామీ ఇచ్చి మోసం చేసిందని సత్యం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజా పాలన కొనసాగుతుందని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. రుణమాఫీ లబ్ధిపొందని వారు ఆందోళన చెందవద్దని, క్రమంగా అర్హులైన రైతులకు మాఫీ అవుతుందని చెప్పారు.

గిరిజనులపై దాడులు ఆపాలి

శంకర్‌పల్లి: అసైన్డ్ భూములు ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం కొండకల్‌తండాలో తమ పొలాల వద్ద తండా వాసులు నిరసన వ్యక్తం చేశారు. నిరసనకు మద్దతుగా నిలిచిన పలు పార్టీల నాయకులు మాట్లాడారు. వల్లభకుంట, మీర్సాబ్ కుంట, బిల్లా దాఖలు, గిరిజనుల అసైన్డ్ భూములను ఓ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కబ్జా చేస్తుందని ఆరోపించారు. ఇదే విషయంపై ప్రశ్నించిన గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టి, దాడులు చేయిస్తుందని విమర్శించారు ఇప్పటి వరకు శంకర్‌పల్లి, మోకిల ఠాణాల్లో 2021 నుంచి 2024 వరకు పలు సెక్షన్ల కింద 7 కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. కబ్జాకు గురైన కుంటలు, గిరిజన అసైన్డ్ భూములను ప్రభుత్వం గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరారు.

రోడ్డుపై ఇసుక..

జారి పడుతున్న వాహనదారులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి సాగర్ రహదారిపై మట్టి, ఇసుక పోరుకుపోయి.. వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసన వర్షాలకు వరదనీరు పారడంతో.. రోడ్డుపై ఇసుక పేరుకుపోయి.. మేటలుగా తలపిస్తోంది. అయినా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా గాలిలో దుమ్మధూళి లేచి వెనకాల వచ్చే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ద్విచక్ర వాహనాలు కిడ్‌అయి.. చోదకులు గాయాల పాలవుతున్నారు. అధికారులు త్వరగా స్పందించి రహదారిపై ఇసుకను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అసోసియేషన్ భవనానికి నిధులు కేటాయించాలి

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ టెలిఫోన్ కాలనీ రోడ్డు నెంబర్-1 లో ఉన్న కాలనీ అసోసియేషన్ భవనానికి నిధులు కేటాయించాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మంత్రి హోదాలో సబితాఇంద్రారెడ్డి సంక్షేమ భవనానికి దాదాపు రూ. 35 లక్షలు కేటాయించడం జరిగిందని నిధులు సరిపోక పనులు ఆగిపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భవన నిర్మాణం కోసం అధిక నిధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఆ నిధులను వెంటనే కేటాయించి భవనం పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. చిన్నపాటి వర్షానికే సరస్వతి దేవాలయం రోడ్డు నీట మునిగి దేవాలయంతో పాటు ఇళ్లలోకి నీరు చేరుతుందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.44 లక్షలు మంజూరు చేయించారన్నారు. అంతలోనే ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. ఎన్నికలు ముగిసిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన పనులను కాలనీ ప్రెసిడెంట్ సంజీవరెడ్డి, నాయకులు జగన్మోహన్ రెడ్డి, శ్యాం గుప్తా, కపిల్‌తో కలిసి ఆదివారం పరిశీలించారు.

'తీజ్' వేడుకలకు ఆహ్వానం

కడ్తాల్: మండల పరిధి గానుగుమార్లతండాలో ఈ నెల 29న నిర్వహించే తీజ్ వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని గిరిజన నాయకులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన నివాసంలో ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లక్పతినాయక్, మోత్యానాయక్, రాజునాయక్, గోప్యానాయక్, శక్రునాయక్, భాస్కర్‌నాయక్, రాజు, హరి తదితరులు ఉన్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు


పూజాకార్యక్రమంలో నాయకులు

కడ్తాల్: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీక అని పలు పార్టీల నాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మైసమ్మ, ఈదమ్మ, పెద్దమ్మ, బీరప్ప, మడేలు స్వామి ఆలయాలను వారు సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ దేవాలయాల వద్ద బోనాల ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీలకు అతీతంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్ గుప్తా, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాట నర్సింహ, పరమేశ్, బీక్యనాయక్, బీచ్యానాయక్, నర్సింహ, వెంకటేశ్, శ్రీను, చంద్రశేఖర్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్, బాలరాజు, రాములు, శ్రీశైలం, జగన్ ఉత్సవ కమిటీ చైర్మన్ సత్యం యాదవ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు


నేదునూరు బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కందుకూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ తదితర దేవతల బోనాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కందుకూరు, దెబ్బడగూడ, నేదునూరు, మాన్యగూడ, బాచుపల్లి, జైత్వారం, లేమూరు, అగర్‌మియాగూడ, కొత్తూర్ తదితర గ్రామాల్లో బోనాల ఉత్సవాలు కొనసాగాయి. డప్పు వాయిద్యాలు, శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, నృత్యాల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులకు ఏలాంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


అగర్‌మియాగూడలో ఎస్సై పరమేశ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

'భక్తితత్వం లేకుండా హిందూమతమే లేదు'


కళాకారులను సత్కరిస్తున్న విజయశంకరస్వామి

వనస్థలిపురం: భక్తితత్వం లేకుండా హిందూమతమే లేదని, భక్తిని ఆవిష్కరించే అసంఖ్యాక కళల వల్లే హిందూమతం సజీవంగా ఉందని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి అన్నారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం వనస్థలిపురంలోని వినాయక నాట్యమండలి (సురభి) ప్రాంగణంలో నిర్వహించిన భాగ్యనగర 'హైందవ భక్తి కళా సమ్మేళనం'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హిందూధర్మంలో విభిన్న స్రవంతులు, సంప్రదాయాలు ఉన్నా కేవలం భక్తి సంప్రదాయమే హైందవ సంస్కృతికి జీవగర్రగా ఉందన్నారు. విజయ విహారం రమణమూర్తి మాట్లాడుతూ.. హైందవ భక్తి కళలకు సంబంధించిన ఈ సమ్మేళనం అత్యంత విశిష్టమైనదని అన్నారు. ఈ సందర్భంగా కూచిపూడి, భరతనాట్యం, యక్షగానం, చిందు, బుర్రకథ, కోలాటం, చెక్కభజన వంటి భజన సంప్రదాయాలకు చెందిన కళా బృందాలు తమ కళారూపాలను ప్రదర్శించారు. అనంతరం వారిని ని ర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దరూరి నరసింహాచార్యులు, శివస్వా మి, విజయారెడ్డి, చినుకు మూర్తి, అక్కిరాజు సు ందర రామకృష్ణ, తెలుగు వెలుగు శ్రీరామ్ దత్తు, మాతా పరమేశ్వరానందమయి పాల్గొన్నారు.

సీఎంపై దుష్ప్రచారం మానుకోవాలి

దిల్‌సుఖ్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీజేపీలు కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డిపై దుష్ప్రచారం మానుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం నిర్వహించిన ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల ముఖ్య నాయకుల సమావేశంలో దేప భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్‌ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఖండించారు. చెరువులను మింగిన గత పాలకులు హైడ్రా అంటే భయపడుతున్నారని చెరువులను కబ్జా చేసిన వారి కోరలు పీకేందుకే సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైడ్రా ఏర్పాటైందన్నారు. బీజేపీకి మత రాజకీయాలకు తప్పా ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచన లేదన్నారు. ఈ సమావేశంలో ఉపేందర్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, మధుసూదన్ రావు, రమేష్ నేత, మహేందర్, లింగస్వామి గౌడ్, యాదవ రెడ్డి, దుబ్బాక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి